వీడని వర్షం.. పంటలకు నష్టం

- ప్రాథమిక జాబితా సిద్ధం
- రైతులకు అండగా ప్రభుత్వం

ఏలూరు (మెట్రో): గత ఐదు రోజులుగా చెదురు మదురు వర్షం కురుస్తూనే ఉంది. ఓ చోట ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుంటే, మరో చోట ఈదురుగాలులతో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కురుస్తోన్న వర్షాలకు రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఏలూరు జిల్లాలోని 17 మండలాలతో పాటుగా, పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం మండలం కలుపుకుని మొత్తం 110 గ్రామాల్లో పంటలను రైతులకు ఒక మోస్తారు నుంచి భారీ నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా, సోమవారం కూడా కుకునూరు, వేలేరుపాడు, జంగారెడ్డిగూడెం, ఏలూరు, తాడేపల్లిగూడెం ఇలా ప్రధాన పట్టణాల్లో గ్రామాల్లో సైతం చిరుజల్లులు కురుస్తున్నాయి.


కొయ్యలగూడెం మండలం పొంగుటూరులో నేలవాలిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

కుకునూరు మండలంలో వడగండ్ల వాన తీవ్రంగా మిర్చి రైతును నష్టపరిచింది. ఇప్పటికే వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తూ పంటలు నష్టపోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారులు పంట నష్టం ప్రాథమిక వివరాలను సిద్ధం చేశారు. వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం ఉమ్మడి జిల్లాలోని 18 మండలాల్లో 110 గ్రామాల పరిధిలో వర్షాలు దెబ్బకు 1,472 హెక్టార్లలో పంటలు ముంపులో ఉన్నాయి. వీటిలో మొక్కజొన్న 804 హెక్టార్లు, వరి 6 హెక్టార్లు, మినుములు 163 హెక్టార్లు, వేరుశెనగ 6 హెక్టార్లు, మిరప 8 హెక్టార్లు, పొగాకు 485 హెక్టార్లలో ముంపులో ఉన్నాయి. అలాగే మినుము 420 హెక్టార్లలో, వేరుశెనగ 3 హెక్టార్లలో కోతలు పూర్తయి కల్లాల్లో ఉన్నాయి. ఉద్యానశాఖకు సంబంధించి ఏలూరు జిల్లాలో 2 మండలాల్లో 2 గ్రామాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఈ గ్రామాల్లో 45 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, అరటి 8 హెక్టార్లలో, బొప్పాయి 4 హెక్టార్లలో, నిమ్మ 32 హెక్టార్లలో, కూరగాయలు పంటలు దెబ్బతిన్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఏలూరు జిల్లాలో 5.6 మి.మి. వర్షపాతం నమోదు కాగా, పశ్చిమగోదావరి జిల్లాలో 4.2 మి.మి. వర్షపాతం నమోదైంది. మరో 24 గంటలు చెదురుమదురు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖాధికారులు తెలిపారు.

క్లుప్తంగా

నూతన ఉత్సాహం వెల్లివిరియాలి


ఉగాది ఉత్సవంలో పాల్గొన్న నగర మేయర్ నూర్జహాన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే తెలుగు నూతన సంవత్సరంలో తెలుగు ప్రజల్లో నూతన ఉత్సాహం వెల్లివిరియాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఆకాంక్షించారు. సోమవారం స్థానిక నేరెళ్ల రాజా కల్యాణ మండపంలో ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో నిర్వహించిన శోభకృత్ నామ సంవత్సర ఉగాది సంబరాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని చెప్పారు. తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా ఆర్యవైశ్య మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహిస్తున్న నిర్వాహకులు కూరాళ్ల రమాదేవి, మాజీ డిప్యూటీ మేయర్ గుడివాడ రామచంద్ర కిషోర్‌లను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. పెద్ద సంఖ్యలో హాజరైన ఆర్యవైశ్య మహిళలకు మేయర్ నూతన తెలుగు సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

22న ఉగాది కళా సమ్మేళనం

ఏలూరు (టూటౌన్): ఈ నెల 22వ తేదీన నిర్వహించే ఉగాది కళా సమ్మేళనంను విజయవంతం చేయాలని పలువురు నాయకులు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. 2023 ఉగాది సందర్భంగా ఏలూరు కెనాల్ రోడ్డులో ఉన్న యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సాయంత్రం 3 గంటలకు నిర్వహించే సాంస్కృతిక సమ్మేళనంకు ఏలూరు పరిసర ప్రాంతాల ప్రజా సంఘాలు, వివిధ పార్టీలు, స్వచ్ఛంద సేవా సంస్థలకు చెందిన వారు పాల్గొనాలని కోరారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్: ఏలూరు మండలం చాటపర్రులో-2, తంగెళ్లమూడి-1, శనివారపుపేట-1 చొప్పున ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 27న దరఖాస్తుల పరిశీలన, 28న మౌఖిక పరీక్ష, 29న ఫలితాల వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఎంపికైన వారికి 30వ తేదీన ఒకరోజు శిక్షణ, ఏప్రిల్ 1 నుంచి విధులకు హాజరుకావాల్సి ఉంటుందని వివరించారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఆదివారపు పేటలోని షిర్డీ సాయి ప్రేమ మందిర్ చతుర్థ వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం షిర్డీ సాయి నగర సంకీర్తన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు సమర్పించారు. విశేష అలంకరణ చేసి సాయినామ సంకీర్తనలు, సాయి సచ్చరిత్ర పఠనం చేశారు. సాయంత్రం వాసా ప్రసాద రావు బృందం ఆధ్వర్యంలో సత్సంగ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉపాధ్యాయుల వివరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జంగారెడ్డిగూడెం హైస్కూల్లో ఫర్నీచర్ ధ్వంసం చేసిన ఘటనలో విద్యార్థులను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లిన ఉపాధ్యాయులకు డీఈఓ ఎస్‌వీ రవి సాగర్ షోకాజ్ నోటీసులు జారీ చేసిన సంగతి విదితమే. నోటీసులు అందుకున్న ఉపాధ్యాయులు సోమవారం రవి సాగర్‌ని కలిసి తమ వివరణ సమర్పించారు. ఈ వివరణలపై తదుపరి చర్యలు తీసుకోనున్నట్టు డీఈఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

బాధితుడి ఆచూకీ లభ్యం

ఏలూరుకు చెందిన రాగోలు సత్యనారాయణ


చికిత్స పొందుతున్న సత్యనారాయణ

ఏలూరు టౌన్: ఏలూరు గన్‌బజార్ మసీదు సెంటర్ ప్రాంతంలో ఆదివారం పట్టాలు దాటుతున్న వ్యక్తిని గూడ్సు రైలు ఢీకొని తీవ్రగాయాలవటంతో రైల్వే పోలీసులు అతడ్ని ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. క్షతగాత్రుడి సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సోమవారం ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చి అతడ్ని మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. క్షతగాత్రుడు ఏలూరు 40వ డివిజన్ 12 పంపుల సెంటర్ స్కూల్ వెనుక తుమరాడ వారి వీధికి చెందిన రాగోలు సత్యనారాయణగా గుర్తించారు. ఆయన గత ఆరు నెలలుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. మూడు నెలల క్రితం ఏలూరు ఆర్ఆర్‌పేట వెంకటేశ్వరస్వామి గుడి సెంటర్‌లోని ద్వారకా హాస్పిటల్‌లో నోటి క్యాన్సర్ ఆపరేషన్ చేయించుకున్నాడు. గత 15 రోజులుగా ఏలూరు వంగాయగూడెంలోని క్యాన్సర్ హాస్పిటల్‌లో కీమో థెరపీ చికిత్స పొందుతున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి గన్‌బజార్ మసీదు సెంటర్ ప్రాంతంలో రైలు పట్టాలు దాటుతూ ఉండగా గూడ్స్‌రైలు ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, బంధువుల నగరం అంతా వెదికి చివరికి వార్తా పత్రికల్లో ఫోటోను చూసి హాస్పిటల్‌కు చేరుకుని, మెరుగైన వైద్యానికి ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అతని ఆరోగ్యస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని రైల్వే ఎస్సై నరసింహారావు తెలిపారు.

శెట్టిబలిజలకు సీఎం జగన్ సముచిత గౌరవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో శెట్టిబలిజ జాతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సముచిత గౌరవం దేకూర్చారని ఏలూరు పట్టణ, పరిసర గ్రామాల శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీఎస్‌వీ శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు రాజ్యసభలో, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణకు రాష్ట్ర క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు జిల్లాకు చెందిన కవురు శ్రీనివాస్‌ను తొలుత డీసీసీబీ చైర్మన్‌గా, అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్‌గా నియమించి ప్రస్తుతం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం తమ సామాజికవర్గానికి రాజకీయంగా తగిన ప్రాధాన్యత కల్పిస్తున్నట్టు భావిస్తున్నామని చెప్పారు. శెట్టిబలిజ జాతి అంతా ముఖ్యమంత్రికి అండగా ఉంటుందని తెలిపారు. కవురు శ్రీనివాస్ ఎమ్మెల్సీగా ఎన్నికైన నేపథ్యంలో ఖాళీ అయిన జిల్లా పరిషత్ చైర్మన్ పదవిలో తిరిగి తమ సామాజికవర్గానికి చెందిన సమర్థుడయిన నాయకుడికి అవకాశం కల్పించాలని కోరారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 11 మంది బీసీ జెడ్పీటీసీ సభ్యులు ఉండగా వారిలో నలుగురు శెట్టిబలిజలున్నారని, వారిలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎవరికి అవకాశం ఇచ్చినా స్వాగతిస్తామని తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు యిళ్ల వరప్రసాద్, వనుము విజయ నరసింహారావు, యిళ్ల శ్రీనివాస్, యాండ్ర సుబ్బారావు, యాండ్ర శ్రీనివాసరావు, దంపనబోయిన సుబ్రహ్మణ్యం, కడలి వెంకట సత్యనారాయణ, చింతపల్లి రవి కుమార్, చింతపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు ప్రతి విద్యార్థికీ అందాలి

ఏలూరు రూరల్: సంక్షేమ పథకాలు ప్రతి విద్యార్థికీ అందాలని రీజినల్ జాయింట్ డైరక్టర్ జి.నాగమణి అన్నారు. సోమవారం ఆమె సత్రంపాడు జడ్పీ పాఠశాలను ఆమె సందర్శించారు. విద్యార్థుల నోట్, వర్క్‌బుక్స్, పరీక్ష పేపర్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు 6000 నిమిషాలకు పైగా బైజూస్ కంటెంట్ వినియోగించాలన్నారు. దీనివల్ల విద్యార్థులు మరిన్ని మెళకువలు తెలుసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఉపాధ్యాయులు ఎఫ్-4 ఎగ్జామినేషన్, ప్రీ పబ్లిక్ ఎగ్జామినేషన్ పేపర్లు అనుకున్న సమయానికి విద్యార్థులకు అందించాలని, రాబోయే 10వ తరగతి పరీక్ష కోసం విద్యార్థులను సన్నద్ధం చేసేలా ప్రణాళిక రూపొందించుకోవాలని హెచ్‌ఎం జయరామన్‌కు సూచించారు.


బైజూస్ కంటెంట్‌ను వివరిస్తున్న ఆర్జేడీ నాగమణి

ఫలితంగా ఉత్తీర్ణత శాతం పెంచుకోవాలన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనం పరిశీలించి నాణ్యమైన ఆహారం అందేలా చూడాలన్నారు. ఆమె వెంట ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి ఉన్నారు.

స్పందనకు భారీగా ఫిర్యాదులు


శాఖలవారీగా ఫిర్యాదులు స్వీకరిస్తున్న సిబ్బంది


ప్రత్యేక గ్యాలరీలో కూర్చున్న ఫిర్యాదుదారులు


క్యూ కట్టిన ఫిర్యాదుదారులు


వృద్ధుల వద్దే సమస్యలు వింటున్న డీఆర్ఓ

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో సోమవారం కలెక్టరేట్‌కు ఫిర్యాదుదారులు పోటెత్తారు. ఎన్నికల కోడ్‌తో జిల్లా కలెక్టరేట్‌లో నాలుగు వారాలుగా స్పందన కార్యక్రమానికి అంతరాయం ఏర్పడిన విషయం విదితమే. సోమవారం యథావిధిగా స్పందన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు ఇబ్బంది కలగకుండా వారి వద్దకే వచ్చి డీఆర్ఓ సమస్యలను విన్నారు. శాఖలవారీగా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారులకు చెప్పుకున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	46-70
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	08-10
బెండకాయలు	44	కంద	46
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	34
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	54	అల్లం	100
క్యాబేజీ	20-25	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	18	పాలకూర	10
దొండకాయలు	36	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	46	పుదీనా	05
దోసకాయలు	28-34	బఠాణీ	70
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	30-34

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	32
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4836	34
ఏలూరు - తిరుపతి	16.00	4630	32

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా పోటీల్లో పాల్గొన్న సాధకులు


యోగా పోటీలకు తరలివచ్చిన బాలికలు

ఇండోర్ స్టేడియంలో యోగా పోటీలు

ఏలూరు రూరల్: యోగ సాధనతో విద్యార్థులు మానసిక, శారీరక ఆరోగ్యం సాధించవచ్చని సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహ్రాజ్ అన్నారు. 2023 ప్రపంచ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం ఏలూరులో క్రీడాధికారులు యోగా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్ జిల్లా చీఫ్‌కోచ్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు, వ్యాయామ సాధన చేయలని సూచించారు. క్రీడలు, ఆరోగ్యం పట్ల బాలికలు, మహిళల్లో అవగాహన పెంచేందుకు ఈ నెల 8వ తేదీ నుంచి 25 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, షటిల్, బాడ్మింటన్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, పతకాలు అందించామని తెలిపారు. యోగా పోటీల్లో సైతం బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారని వివరించారు. కార్యక్రమంలో కోచ్ షేక్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు, సస్య రక్షణ చర్యలతో మేలు


చొదిమెళ్లలో రైతులతో వ్యవసాయ విద్యార్థులు

ఏలూరు రూరల్: చొదిమెళ్లలో రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. స్థానిక బెజవాడ వెంకటేశ్వరరావు పంట చేలో వరిసాగు పద్ధతిని పరిశీలించారు. రసాయన ఎరువులు వాడకం వల్ల పంటకు మేలు చేసే మిత్రపురుగుల నశించడంపై రైతులకు వివరించారు. ఫలితంగా కాలుష్యం పెరుగుదలకు గల మార్గాలు అర్థమయ్యేలా చెప్పారు. సేంద్రియ ఎరువులు ఉపయోగం, సకాలంలో సస్య రక్షణ చర్యలు చేపట్టడం వల్ల కలిగే మేలు, అధిక దిగుబడిని వివరించారు. సాగు సమయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థులు జి.జగదీశ్వరి, ఎన్ జాహ్నవి, ఎం.జ్వాలా, కె.శర్వాణి, వై.సత్యవతి తెలుసుకున్నారు. రైతులు బండి ప్రసాదరావు, నాగేశ్వరరావు, బెజవాడ లక్ష్మణ్, వాసే జాన్ తదితర రైతులు తమ అనుభవాలను విద్యార్థులకు వివరించారు.

రూ.500 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపనలు

దెందులూరు: దెందులూరులో ఈ నెల 25వ తేదిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 500 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, సొసైటీ చైర్మన్లు, పార్టీ మండల అధ్యక్షులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలతో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడారు. దెందులూరు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.500 కోట్లతో అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి వచ్చి ప్రారంభించడం ఇదే ప్రథమమని తెలిపారు. నవరత్నాల్లో ఒక్కటైన వైఎస్సార్ ఆసరా పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు లబ్ధి చేకూరే విధంగా దెందులూరులో బటన్ నొక్కి ప్రారంభిస్తుండడం ఎమ్మెల్యేగా తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం దెందులూరులో ప్రారంభించడం నియోజకవర్గంలో మహిళలందరికీ శుభవార్త కానుందని చెప్పారు. ముఖ్యమంత్రి దెందులూరు పర్యటనను నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ఏలూరు జిల్లా పరిధిలో పెదవేగి, ముసునూరు గ్రామాల మధ్య ఉన్న తమ్మిలేరుపై రూ.17 కోట్లతో బలివేపై వంతెన నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 25న ముఖ్యమంత్రి తాడేపల్లి నుంచి బయలుదేరి నేరుగా దెందులూరు ఉదయం 10 గంటలకు విచ్చేస్తారన్నారు. 10.30 గంటలకు సభ ప్రారంభమవుతుందని, 12 గంటలకు ముగుస్తుందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పలమనూరు ఎమ్మెల్యే వెంకట్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మంచి వ్యక్తిత్వం గల సేవా నిరతిగల ప్రజాప్రతినిధి అని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, పార్టీ పెదపాడు మండల అధ్యక్షుడు అప్పన ప్రసాద్‌లను దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు అభినందించారు. సమావేశంలో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అన్ని విభాగాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ పోరాటాలు ఆదర్శనీయం


అంబేడ్కర్ విగ్రహం వద్ద నినదిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీలకు మానవ హక్కులు కల్పించిన యోధుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఏఐఏవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అన్నారు. 96వ ఎస్సీ కులాల సామాజిక హక్కుల దినం సందర్భంగా స్థానిక నర్సింహారావుపేటలోని సంఘ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సంతోష్ కుమార్ మాట్లాడుతూ నాడు మహాడ్ సత్యాగ్రహం ఉద్యమాన్ని నడిపి ఎస్సీ కులాల ప్రజలకు అంబేడ్కర్ మానవ హక్కులు కల్పించారని, 1927 మార్చి 20న కొన్ని వేల మంది మహిళలతో మహాడ్ పట్టణం చౌదార్ చెరువులో దిగి మంచినీరు తాగించిన విషయాన్ని గుర్తు చేశారు. చెరువు నీరు అందరూ తాగవచ్చంటూ మానవ విలువలతో హక్కు కల్పించిన వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. ఆయన నడిపిన పోరాటాలను ఆదర్శంగా తీసుకుని నాయకులు ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరకుండి బాబూరావు, కార్యాలయ ఇన్‌చార్జి పల్లా యేసేబు, నిట్టా సురేష్ మోహన్, పి.రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.